నేడు ప్రత్యేక సమన్వయ సమావేశం

మల్యాల, ఏప్రిల్ 7: కొండగట్టులో ఈనెల 23న హనుమాన్ చిన్న జయంత్యుత్సవాల నిర్వహణపై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ యాస్మిన్‌బాషా అధ్యక్షతన అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జయంత్యుత్సవాల నిర్వహణతో పాటు భక్తులకు సౌకర్యాల కల్పన, ఇతర అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం మరమ్మతులు చేపడుతున్నందున మల్యాల, ముత్యంపేట, నూకపల్లి, రాజారాం గ్రామాల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 7: మండలంలోని ఓగులాపూర్ గ్రామానికి చెందిన బొజ్జ లక్ష్మి (38) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రహీం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి కుటుంబ సభ్యులు ఉపాధి కోసం అప్పు చేసి గొర్రెలు కొనుగోలు చేయగా, ఇటీవల కొన్ని మృతిచెందగా, మరికొన్ని అనారోగ్యం బారిన పడ్డయి. ఈ క్రమంలో అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన లక్ష్మి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మి భర్త బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని పైడిమడుగు గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాయికల్ గ్రామానికి చెందిన కట్కం లక్ష్మీకాంతం ద్విచక్రవాహనంపై పైడిమడుగు గ్రామానికి శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మీకాంతం కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

నా భర్తను బతికించండి

- కిడ్నీలు ఫెయిల్ కావడంతో తల్లడిల్లుతున్న తిరుపతి
- నాలుగేండ్లలో చికిత్సకు ఏడున్నర లక్షల ఖర్చు
- శస్త్ర చికిత్సకు రూ. 3 లక్షలు అవసరమన్న వైద్యులు
- ఆపన్నహస్తం అందించాలని భార్య లావణ్య వేడుకోలు

కిడ్నీలు చెడిపోవడంతో ఇంటి పెద్దదిక్కు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. నాలుగేండ్లుగా డయాలసిస్ చేయించుకుంటూ బతుకెళ్లదీస్తున్నాడు. ఇప్పటికే అప్పులు తెచ్చి చికిత్సకు లక్షలు వెచ్చించినా ఫలితం లేకుండా పోయింది. కిడ్నీ మార్పిడి చేయాలని, ఇందుకు రూ. 3 లక్షలు అవసరమని వైద్యులు చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబం తల్లడిల్లుతున్నది. దాతలు దయతలచి నా భర్తను కాపాడాలని భార్య లావణ్య దీనంగా వేడుకుంటున్నది.

-మల్లాపూర్, ఏప్రిల్ 7

దవాఖానలో చికిత్స పొందుతున్న తిరుపతి

మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన సామల్ల తిరుపతి నాలుగేండ్ల కిందట కిడ్నీ వ్యాధి బారినపడ్డాడు. వైద్యులకు చూపించగా కిడ్నీలు ఫెయిలయ్యాయని చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబం ఆందోళనకు గురైంది. అప్పులు చేసి ఏడున్నర లక్షల దాకా ఖర్చు చేశారు. అయినా వ్యాధి నయం కాకపోవడంతో ఇటీవల కోరుట్ల దవాఖానలో చేరగా పరీక్షలు చేసిన వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని, ఆపరేషన్‌కు రూ. 3 లక్షలు అవసరమని చెప్పారు. అయితే, భార్య లావణ్య కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధపడ్డది. కానీ చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నది. దాతలు దయతలచి ఆపరేషన్‌కు సాయం చేయాలని లావణ్య దీనంగా అర్థిస్తున్నది. సాయం చేయాల్సిన వారు 8309424664 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే చేయాలని వేడుకుంటున్నది.

ఉపాధి కోసం వెళ్లి.. ఊపిరి వదిలి..

- సౌదీలో వలసజీవి హఠాన్మరణం
- ఈ నెల 3న దమ్మన్నపేటకు చెందిన రాజశేఖర్ మృత్యువాత
- మృతదేహం కోసం కుటుంబసభ్యుల ఎదురుచూపు
- దాతలు సాయం చేయాలని వేడుకోలు

ఉపాధి కోసం దూర దేశం వెళ్లిన వ్యక్తి అక్కడే ఊపిరివదిలాడు. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన రాజశేఖర్ ఈ నెల 3న గుండెపోటుతో మృత్యువాత పడ్డాడు. ఇంటి పెద్దదిక్కు మరణవార్త విని భార్యాబిడ్డలు తల్లడిల్లుతున్నారు. కంటిమీద కునుకులేకుండా శవపేటిక కోసం ఎదురుచూస్తున్నారు. లోలోన కుమిలిపోతూ దాతలు సాయం చేయాలని వేడుకుంటున్నారు.

-మేడిపల్లి, ఏప్రిల్ 7

మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన నిమ్మ రాజశేఖర్ (36) 15 సంవత్సరాల క్రితం అప్పులు చేసి ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ పని సరిగ్గా లేకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో నాలుగేండ్ల తర్వాత స్వగ్రామానికి వచ్చాడు. మూడేండ్లు ఇంటివద్ద ఉన్న తర్వాత మళ్లీ ఎనిమిదేండ్ల క్రితం సౌదీకి వెళ్లాడు. అక్కడ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న ఉదయం తన రూంలో గుండెనొప్పితో కూప్పకూలిపోయాడు. గమనించిన మిత్రులు చికిత్స కోసం దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజశేఖర్ మరణించిన విషయాన్ని అదే రోజు ఆయన స్నేహితులు భార్య మాధవికి ఫోన్‌ద్వారా తెలియజేశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు సుమారు రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. నిరుపేదలమైన తమకు అంతస్థోమత లేదని రాజశేఖర్ భార్యాబిడ్డలు తల్లడిల్లుతున్నారు. దాతలు ముందుకువచ్చి రాజశేఖర్ బావమరిది కస్తూరి అనిల్ ఫోన్ పే నంబర్ 98483833833కి ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.

రాజశేఖర్ (ఫైల్)


ఉపాధ్యాయుడికి పండ్లు అందజేస్తున్న బయోసైన్స్ ఉపాధ్యాయుల ఫోరం సభ్యులు

సాత్వికాహారంపై అవగాహన

జగిత్యాల/జగిత్యాలరూరల్, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ బయోసైన్స్ ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు వీరబత్తిని రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో సాత్వికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈవో జగన్‌మోహన్ రెడ్డి హాజరై ఆరోగ్యం యొక్క ఆవశ్యకతను ఉపాధ్యాయులకు వివరించారు. ఈ సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మచ్చ శంకర్, ప్రశాంతి, రాజేందర్, రాజన్న, నర్సయ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా జలపతిరెడ్డి

మల్లాపూర్, ఏప్రిల్ 7: కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎలాల జలపతిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఆదివారం పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అందజేశారు. ఈ సందర్భంగా జలపతిరెడ్డి మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

జలపతిరెడ్డికి నియామక పత్రం ఇస్తున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, తదితరులు

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 7: ఓ వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వివాహిత గతేడాది జగిత్యాలలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో పని చేసింది. అదే సమయంలో పట్టణంలోని టీఆర్‌నగర్‌కు చెందిన కోటగిరి మోహన్ సదరు వివాహితకు పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో ఆమెతో చనువు పెంచుకోగా, ఇద్దరు కలిసి ఫొటోలు దిగారు. అనంతరం తన కోరిక తీర్చాలంటూ వేధింపసాగాడని, వివాహిత ఒప్పుకోకపోవడంతో ఫొటోలను సోషల్ మీడియాలో పెడుతానని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. కాగా, వివాహిత జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కోటగిరి మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మోహన్‌పై గతంలో జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో ఆరు, జగిత్యాల రూరల్ స్టేషన్‌లో ఐదు, కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్లు సీఐ వేణుగోపాల్ వెల్లడించారు.

చలివేంద్రం ప్రారంభం

జగిత్యాల, ఏప్రిల్ 7: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా ఆదివారం సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్ ప్రారంభించారు. సత్యసాయి సంస్థ సభ్యులను డిపో మేనేజర్ సునీత, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థ ప్రతినిధులు కొత్త ప్రతాప్, విద్యాధర్, వేణుగోపాల్, దశరథ రెడ్డి, ఠాకూర్ నారాయణ్ సింగ్, వంగల లక్ష్మీనారాయణ, చంద్రయ్య, రాంమోహన్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన సత్యసాయి సేవా సమితి సభ్యులు

వృద్ధాశ్రమానికి విరాళం

జగిత్యాల, ఏప్రిల్ 7: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ పిల్లల, వృద్ధాశ్రమానికి జగిత్యాలకు చెందిన అలిశెట్టి లక్ష్మణ్-గీతా రాణి దంపతులు రూ.12వేలు ఆశ్రమం నిర్వాహకుడు సూరజ్ శివ్‌శంకర్‌కు అందించారు. ఆశ్రమంలో నిత్యావసర సరుకుల కోసం ప్రతి నెల రూ. 1,500 చొప్పున అందిస్తామన్నారు. కార్యక్రమంలో వారి కుమార్తెలు వై సుజన, కే సుధారాణి, సురేఖ, కవితారాణి, తేజారాణి పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్వాహకుడికి నగదు అందజేస్తున్న లక్ష్మణ్ దంపతులు

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 7: ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏబీఆర్ఎస్ఎం సహా సంఘటన మంత్రి లక్ష్మణ్‌కు తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కలిసి జగిత్యాల నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్ రావు, ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, కార్యదర్శి వీరమల్ల వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లక్ష్మణ్‌కు వినతి పత్రం ఇస్తున్న తపస్ నాయకులు

ఎమ్మెల్యేకు పరామర్శ

జగిత్యాల, ఏప్రిల్ 7: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తండ్రి హనుమంతరావు ఇటీవల మృతిచెందారు. కాగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో పాటు కుటుంబసభ్యులను ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు.

హనుమంతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్ రావు

మల్లికార్జున స్వామి ఆలయంలో విప్ పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఏప్రిల్ 7: ఊట్‌పల్లి గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాగా, ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. వేడుకల్లో జాతర నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెగడపల్లి, ఏప్రిల్ 7: నంచర్ల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహకారంతో ఆదివారం రెండు చోట్ల బోర్లు వేయించినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోలి మహేందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అంజయ్య, విష్ణు, అనిల్, రాకేశ్, శ్రీకాంత్, రాయమల్లు, నాగరాజు, నరేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 7: సిరిసిల్ల క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాజన్న సిరిసిల్ల ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణితో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకుముందు మైదానంలో ఆయా జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. బీఆర్ఎస్ హయాంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పించామని చెప్పారు. అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్లలో మినీ స్టేడియాన్ని అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్, సత్యనారాయణ, కొంతం రాజం, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

మానకొండూర్, ఏప్రిల్ 7: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యాదవ, రజక, మాల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల కార్యక్రమానికి వినోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాష్ట్ర నాయకుడు గడ్డం నాగరాజు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, వివిధ కుల సంఘాల నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య కరపత్రాల పంపిణీ

జమ్మికుంట, ఏప్రిల్7: పట్టణంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్క అయిలయ్య ఆధ్వర్యంలో హెచ్ఆర్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం ఓటరు చైతన్య కరపత్రాలను పంపిణీ చేశారు. మే 13న జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో 'ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీకే ఓటేద్దాం' అనే నినాదంతో కరపత్రాలను రూపొందించారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 7: నగరంలోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు ఏవీ వేణుగోపాల్, కార్తీక్, శరత్‌ను కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రాజ్ కుమార్, బేతి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ హైకోర్టు న్యాయమూర్తులను కలిసి స్వాగతం పలికారు. జిల్లా కోర్టుకు సంబంధించిన పలు అంశాలను అధ్యక్షుడు రాజ్ కుమార్ హైకోర్టు న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గంగాధర, ఏప్రిల్ 7 : బూరుగుపల్లి మాజీ సర్పంచ్ మాచెర్ల మల్లేశం తల్లి వసంతమ్మ ఆదివారం మృతి చెందగా, వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు ఉన్నారు.

వైరాగ్యంకు శ్రీశ్రీ కళా వేదిక పురస్కారం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 7 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శ్రీశ్రీ కళా వేదిక, కోనసీమ రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం సమన్వయంతో 132వ జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని అమలాపురంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి 140 మంది కవులు పాల్గొన్న సభలో కరీంనగర్‌కు చెందిన భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ 'కవిత్వం అంటే' శీర్షికన కవితా పఠనం చేసి అందరి అభినందనలు అందుకున్నారు.

ప్రజలకు సేవకుడిలా పని చేస్తా..

- పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా
- ఎన్నికల్లో ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్
- కోతిరాంపూర్‌లో మార్నింగ్ వాక్ కార్నర్ మీటింగ్‌కు హాజరు

ఇఫ్తార్ విందులో ముస్లింకు స్వీట్ తినిపిస్తూ శుభాకాంక్షలు చెబుతున్న వినోద్‌కుమార్

కార్పొరేషన్, ఏప్రిల్ 7: ఎన్నికల్లో తనను గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సేవకుడిలా పని చేస్తానని, ఇక్కడి సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 9వ డివిజన్‌లోని కోతిరాంపూర్‌లో మార్నింగ్ వాక్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. స్థానికంగా ఉన్న పోచమ్మ ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. దీనికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి హాజరైన వినోద్‌కుమార్ మాట్లాడుతూ, 2019 ఎన్నికల్లో ఎంపీగా ఓటమి చెందినా కరీంనగర్‌లోనే ఉంటూ ప్రజలకు సేవకుడిలా పని చేస్తున్నానని గుర్తు చేశారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానన్నారు. కానీ, బండి సంజయ్ ఎంపీగా గెలిచి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని విమర్శించారు. అలాగే ఏ రోజు కూడా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని, కేవలం వారి పార్టీ కోసమే పని చేశారని ఆరోపించారు. 3లక్షల జనాభా ఉన్న కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ చేయడం కష్టమని కేంద్ర పెద్దలు చెప్పినప్పటికీ పట్టుబట్టి అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు దగ్గరకు వెళ్లి, స్మార్ట్ సిటీ పథకం కింద రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించానని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరంతో పోటీ పడేలా కరీంనగర్‌ను అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలిపామన్నారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి నయాపైసా నిధులు తేలేదని, కరీంనగర్‌కు మంజూరైన ట్రిపుల్ ఐటీ ఇతర రాష్ట్రాలకు తరలిపోయినా చేతులు ముడుచుకుని ఉన్నారని విమర్శించారు. పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ ఒక్క గుడికి కూడా నిధులు తేలేదన్నారు. కరీంనగర్ ఎంపీగా 2014 నుంచి 2019 వరకు రైల్వేలైన్ తీసుకురావడంతో పాటు, జాతీయ రహదారులను మంజూరు చేయించానని తెలిపారు. కరీంనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ.25 కోట్ల నిధులు తీసుకువచ్చామన్నారు. ఈ సారి ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో అభివృద్ధి కొనసాగాలంటే వినోద్‌కుమార్ ఎంపీగా ఉండాలన్నారు. అప్పుడే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. నగర అభివృద్ధిలో వినోద్‌కుమార్ పాత్ర ఎంతో ఉందన్నారు. ఇతర పార్టీలు చెప్పే అబద్ధాలను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, బండారి వేణు, నాయకులు గందె మహేశ్, ప్రభావతి, కలర్ సత్తన్న, బండ వేణు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప రాజ్యాంగంలో బతకడం గర్వంగా ఉంది

కొత్తపల్లి, ఏప్రిల్ 7 : భారతదేశం ఒక గొప్ప సెక్యూలర్ భావాలు ఉన్న దేశమని, ఇంత గొప్ప రాజ్యాంగంలో బతకడం తనకు గర్వంగా ఉందని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. చింతకుంట గ్రామంలో ఆదివారం ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. హిందూ, ముస్లింలు సోదరభావంతో ఉండి పండుగలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కరీంనగర్‌లో యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయించి విదేశాలకు వెళ్లినా అక్కడ ఉద్యోగాలు సాధించేలా వారిని తీర్చిదిద్దుతామన్నారు.

బండి..ఆలయాలకు తెచ్చిన నిధులెన్నీ?

- దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలి
- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

రాంనగర్, ఏప్రిల్ 7: నిత్యం దేవుళ్లపేరిట రాజకీయం చేసే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్.. తన ఐదేండ్ల పదవీకాలంలో నియోజకవర్గంలోని ఆలయాలకు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రశ్నించారు. దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన గుత్తేదారులకు అక్రమంగా కాంట్రాక్టులు కట్టబెట్టిందని మండిపడ్డారు. బడా వ్యాపారుల అవినీతిని కప్పిపుచ్చి వారిని కాపాడుతున్న మోదీ ప్రభుత్వానికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పీసీసీ కార్